కథ

# సైబర్ చైల్డ్

– అల్లాడి మల్లేశయ్య

"బామ్మా! మనం దేవుణ్ణి ఎందుకు ప్రార్థించాలి?" బామ్మ ఇచ్చిన ప్రసాదం తింటూ యక్షప్రశ్న వేశాడు విశ్వం. ఆమె ఉలిక్కిపడింది. ఏదో వినకూడనిది విన్నట్టుగా మొహం పెట్టింది. తన అరవై ఐదేళ్ళ జీవితంలో ఇలాంటి ప్రశ్న తనకు ఏనాడూ ఎదురవ్వలేదు.

"దేవుణ్ణి ఎందుకు ప్రార్థించాలి?"

విశ్వానికి పదిహేడేళ్ళు వుంటాయి. విశ్వం నాన్న గారు పైచదువులకోసం అమెరికా వచ్చి కుటుంబాన్ని కూడా తీసుకొచ్చి సెటిలైపోయారు. తల్లిదండ్రులతో పాటు ఇండియాకు రెండు మూడుసార్లు వెళ్ళివచ్చాడు విశ్వం. తాతగారు పోయాక విశ్వం నాన్నగారు మహదేవమ్మ గారిని అమెరికా తీసుకొచ్చేశారు. ఆమె అమెరికా వచ్చి అప్పుడే నెల రోజులు గడిచిపోయాయి. ఈ నెల రోజుల్లో తన మనుమడంటే ఆమెకు ఎక్కడలేని మక్కువ ఏర్పడిపోయింది. ఎక్కువకాలం వాడితోనే గడుపుతోంది. ఈమధ్యే కంప్యూటర్‌లో సుప్రభాతం ఎలా వినాలో, భక్తి పాటలు, తనకిష్టమైన పాటలు ఎలా ఆపరేట్ చేసి వినాలో నేర్చుకుంది. మహదేవమ్మ పి.యు.సి చదువుకుంది. మనుమడుఈ చిన్న డబ్బాతో, వివిధ పుణ్యక్షేత్రాల గురించి చదివి వినిపిస్తూ, చూపిస్తూ వుంటే ఆమెకు అబ్బురంగా వుంది. వాడు చేసే ప్రతిపనీ ఆమెకు గొప్ప అద్భుతంగానూ, ఆశ్చర్యంగానూ, వింతగానూ కన్పిస్తూ వుంటుంది.

తానెప్పుడూ అలా ఆలోచించలేదు. ఆలోచిస్తే అర్థమవుతోంది. అది యక్షప్రశ్న కాదని. ఎంతో చిక్కు ప్రశ్ననీ. "నిజమే! దేవుణ్ణి ఎందుకు ప్రార్థించాలి?" మళ్ళీ అంతలోనే అనిపించింది. "అయినా అదేం ప్రశ్న? చోద్యం కాకుంటే! దేవుణ్ణి ఎందుకు ప్రార్థించాలి?" అని అడగటం ఏంటి వీడు? పిదప కాలం, పిదప బుద్ధులు కాకుంటే. అబ్బాయికి కూడా ఎప్పుడూ ఇలాంటి ఆలోచనలు రాలేదు. వీడికేంటి అన్నీ ఇలాంటి ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. అయినా దేశం కాని దేశం వస్తే మరి ఇటువంటి ప్రశ్నలు కాక ఎలాంటివి వస్తాయిలే!" సణుక్కుంది మామ్మ.

*** *** ***

విశ్వంకు కంప్యూటర్‌తో గడపడమంటే చాలా ఇష్టం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రాటుదేలిపోయాడిప్పుడు. ప్రపంచ చరిత్ర చదవడం, మైక్రో బయాలజీ, జెనెటిక్స్ రోజు రోజుకు సాధిస్తోన్న విజయాలు అధ్యయనం చేయడం, ప్రపంచ రాజకీయాలు తిరగేయడం అతని దినచర్యలు. విశ్వం అమ్మగారు మేరీలాండ్ యూనివర్శిటీలో సైకాలజీ ప్రొఫెసర్. విశ్వం నాన్నగారేమో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో పి.హెచ్.డి. చేసి సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతున్నారు. వాళ్ళిద్దరూ ఎప్పుడూ బిజీగా వుంటారు. దాంతో విశ్వానికి బామ్మ చాలా తొందరలోనే దగ్గరైపోయింది. ఈమధ్య తరచూ బామ్మతోపాటు శివ, విష్ణు టెంపుల్‌కు వెడుతున్నాడు. టెంపుల్ నుంచి బయటకు వస్తున్నప్పుడు తన సహజ ధోరణిలో "ఎందుకూ?" అనే ప్రశ్న వేశాడు.

అయినా ఇందులో అంతగా ఆలోచించాల్సింది ఏముంది? అన్పించింది బామ్మకు.

"మన సృష్టికర్త, ఆపద్బాంధవుడు, ఆర్తజన రక్షకుడు, దుష్ట శిక్షకుడు, శిష్ట రక్షకుడు, జగన్నాటక సూత్రధారి పరమేశ్వరుడే కదా!మరి అట్లాంటప్పుడు పరమేశ్వరుడిని పూజించాలి కదా!" అని విశ్వంతో అంది.

"అంటే మనందరినీ దేవుడు సృష్టించాడా?"

"అవును".

"ఎందుకు?"


'నిజమే! ఎందుకు?" బామ్మకు ఈ ప్రశ్నలన్నీ వింతగా అన్పిస్తున్నాయి. తానెప్పుడూ ఇంత లోతుగా ఆలోచించలేదు.

"అదంతా భగవంతుని లీలయ్యా!" అంది.

భగవంతుడు మనల్ని సృష్టించాడు కాబట్టి మనం భగవంతుణ్ణి ప్రార్థించాలా? ప్రార్థించకుంటే ఏమౌతుంది?" తిరిగి ప్రశ్నించాడు.

అందులో వ్యంగ్యం కానీ, చులకన కానీ ఏదీ లేదు. ఆ అడిగే విధానంలో తెలుసుకోవాలన్న పట్టుదల తప్ప మరేం కన్పించలేదావిడకి. మనుమడు వేసే ప్రతి ప్రశ్నా ఆవిడని ఆలోచనల్లోకి నెట్టివేస్తోంది. బామ్మకు అంతా అయోమయంగా వుంది. "ప్రార్థించకుంటే ఏమౌతుంది?" అనే విషయాన్ని అసలు ఊహించలేకపోతోంది. కాని ఆ ప్రశ్న మనసు లోపలి పొరల్ని తాకింది. చెవుల్లో ఇంకా విన్పిస్తోంది. "దేవుణ్ణి ప్రార్థించకుంటే ఏమౌతుంది? అని. పదిహేడేళ్ళ బుడ్డడు అలాంటి ప్రశ్నలు వేస్తుంటే బామ్మకు కాస్త కోపం కూడా వచ్చింది. కానీ ఆ కోపంలో ప్రేమ వుంది. ఇలాంటి ప్రశ్నలు వేస్తే భగవంతుడు వాడిని అనుగ్రహించడేమోనని భయమున్నా ఏదో చిన్నవాడులే! తెలిసో తెలియకో అంటున్నాడు కాబట్టి భగవంతుడు అర్థం చేసుకుని క్షమిస్తాడులే అన్న ధీమా ఆవిడలో కలిగింది. మరొక్క క్షణంలో ఆ ప్రశ్న





మళ్ళీ మదిలో మెదిలింది.

"ప్రార్థించకుంటే ఏమౌతుంది?' ఈ ప్రశ్న రాను రాను జటిలంగా మారిపోతూ అన్పిస్తున్నా ఆవిడని ఆలోచనలు తొలుస్తున్నాయి.

"పరమేశ్వరుడిని చేరాలంటే కఠోర దీక్ష అవసరం" అని తన మేనత్త చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి మహాదేవమ్మకు. అప్పుడెప్పుడో క్లాసులో తెలుగు పండితులు విశ్వనాథం మాస్టారు చెప్పిన [illegible] కోసమే భక్తి" అన్న పలుకులు గుర్తొచ్చాయి. భగవద్గీతలో అప్పుడప్పుడు వినే శ్లోకం గుర్తుకొచ్చింది.

'అనేక జన్మములెత్తిన పిదప, విజ్ఞానియైన మానవుడు నా శరణమును పొందుచున్నాడు."

వాటిని నెమరు వేసుకుంటూ మహాదేవమ్మ ఒకసారి విశ్వం వైపు చూస్తూ చెప్పడం ప్రారంభించింది. "ఈ జీవితం అశాశ్వతమైనది. నీటిబుడగ లాంటి ఈ జీవితం సార్థకం కావాలంటే భగవంతుని ధ్యానమొక్కటే మార్గం. మనం భగవంతుని సన్నిధి చేరాలంటే కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలు వదిలి స్థిరచిత్తంతో ఆయన్ని ధ్యానించడమొక్కటే మార్గం. అలాకాక భగవంతుని మరచి పాపాలు చేసిన వాడు నరకాన్ని చేరుకుంటాడు. అంతేగాక వర్షాలు సరిగ్గా పడాలన్నా, పంటలు పండాలన్నా, ప్రజలంతా రోగాలూ, రొష్టులూ లేకుండా సుఖ జీవనం సాగించాలన్నా ఆ పరమేశ్వరుడి అనుగ్రహం వుండాలి కదా! మనమెంతవారం!"

"అది కాదు బామ్మా! దేవుడు మనల్ని సృష్టించడమెందుకూ, ఆ తరువాత వీడు పాపం చేస్తున్నాడా? పుణ్యం చేస్తున్నాడా? అని గమనించడమెందుకు? ఆటు తర్వాత స్వర్గానికో, నరకానికో పంపడమెందుకు? సరే! భగవంతుడు మనల్ని సృష్టించాడే అనుకో! పాపం చేయకుండా మన మెదడులో చిన్న లాజిక్ పెట్టి వుండొచ్చు కదా! మరి నువ్వేమో వర్షాలు సరిగ్గా పడడం, రోగాలూ, రొష్టులూ రాకపోవడం దేవుడి అనుగ్రహం ద్వారానే సాధ్యమని అంటున్నావు. మరి అమెరికాలో వర్షాలు ఎలా పడుతున్నాయి? అమెరికాలో ఎవరూ మన శివుడు, విష్ణువు, బ్రహ్మలను పూజించట్లేదు కదా!"

"అంటే ఎవరి ఆచారం ప్రకారం వాళ్ళు నడుచుకొంటారు. ఇక్కడి వాళ్ళు యేసునో, మరొకర్నో పూజిస్తారు కదా!" వాదనలోకి దిగింది బామ్మ.



## ఒంటరైన

## సుస్మితా సేన్

ఇంతకాలం దేశంలోని అన్ని పత్రికలూ వ్రాసిన సుస్మితా సేన్ విక్రమ్‌భట్‌ల సంబంధానికి ఇక తెరపడినట్టే. ఇద్దరూ గట్టిగా నీదారి నీది, నాదారి నాది అని విడిపోవడంతో విక్రమ్‌భట్ బుద్ధిగా తన భార్యా పిల్లల దగ్గరికి పోయాడు. కానీ పాపం మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్ మాత్రం తన పుస్తకాలూ, కవిత్వం, కంప్యూటర్‌లతో ఒంటరిగా మిగిలిపోయింది.

కాని ఎందుకో బామ్మకు మనసొప్పలేదు.

"యేసునో, మరొకర్నో పూజిస్తే శివుడినో, విష్ణువునో పూజించినట్టు ఎలా అవుతుంది" అని వాదనను కొనసాగిస్తున్నాడు. అలా మాట్లాడుకుంటూ గుడి దగ్గర పార్కింగ్ ప్లేసుకి వచ్చేశారు. ఇద్దరూ కారెక్కారు. విశ్వం కారు నడుపుతూ మాట్లాడడం ప్రారంభించాడు.

"సరే! అమెరికాలో జీసస్‌ను పూజిస్తున్నారు బాగానే వుంది. మరి చైనా, రష్యాల్లో వర్షాలు ఆగిపోవట్లేదే! రోగాలూ, రొష్టులతో ప్రజలు బాధపడిపోవడం లేదే! మరి ఎడారుల్లో ప్రజలు ప్రార్థించడం లేదంటావా? అక్కడ వర్షాలు ఎందుకు పడటం లేదు? అదీకాక రోగాలు వస్తే మందులెందుకు వేసుకోవడం? దేవుణ్ణి ప్రార్థించి కూర్చోవచ్చు గదా! వర్షమెప్పుడు వస్తుంది? ఎండెంత కొడుతుంది? చలి ఎంత వుంటుంది? మబ్బు పట్టడం పట్టకపోవడం గురించి మనకు ఇప్పుడు వారం ముందే తెలిసిపోతోందిప్పుడు. ఒకప్పుడు పిడుగు పడితే అది దేవుని లీలగా భావించేవారు. ఇప్పుడు ఐదో క్లాసు పిల్లాడికి కూడా తెలుసు. అది రెండు మేఘాలు ఢీకొనడం వల్ల వస్తుందని. చంద్రుని మీదకు మానవుడు వెళ్ళివచ్చాడు. సూర్యుడు ఒక నక్షత్రం అని నిరూపించాడు. అయినా మనం ఇంకా సూర్యుణ్ణి, చంద్రుణ్ణి పూజిస్తూనే వున్నాం. లేని ఉన్న కథల్ని నమ్ముతూనే వున్నాం. మతాలు, ఆచారాలు, పూజలు వాటినే సమర్థిస్తున్నాయి. మరి మనం కొంచెం లాజికల్‌గా ఆలోచిస్తే అవన్నీ మూఢాచారాలని అనిపించట్లేదా?"

"అంటే నువ్వనేది ఏమిట్రా? దేవుడు లేడంటావా? గుడులు, గోపురాల చుట్టూ తిరిగే వాళ్ళు పిచ్చివాళ్ళనుకుంటున్నావా? ఏవో నాలుగు మందు బిళ్ళలు, ఒక డబ్బా కంప్యూటర్, టీవీలు, విమానాలు తయారు చేసినంత మాత్రాన మనిషి దేవుడై పోతాడా? దేవుడే లేడనుకుంటారా? కలియుగం అంతరించే కాలం దగ్గరపడింది" అంటూ విరుచుకుపడింది బామ్మ.

"అది కాదు బామ్మా! నేను దేవుడున్నాడా? లేడా? అన్న విషయం చర్చించడం లేదు".

"మరి!" బామ్మలో ఆశ్చర్యం.

"నేననేదేంటంటే, లాజికల్‌గా ఆలోచించమని. మనకు కొన్ని నిజాలు తెలుసు. వాటి ద్వారా తెలియని వాటిని తెలుసుకోవడానికి ప్రయత్నించాలని. అంతేగాని మనకు తెలియని దాన్ని గుడ్డిగా నమ్మవద్దని. కొందరు జీసస్‌ను దేవుడంటారు. మరికొందరు అల్లాను దేవుడంటారు, ఇంకొందరు రాముడే దేవుండంటారు. మరి ఇలా ఓ పది మతాలవారు "మా మతం కరెక్టు!మా దేవుడే దేవుడు" అని విపరీతంగా వాదించేస్తున్నారు. బాగానే వుంది. మరి ఏదో ఒక మతం, ఏదో ఒక దేవుడు కరెక్టయితే మిగతా తొమ్మిది మతాల వారు పిచ్చి వారికిందే లెక్క, కదా! ఈ లెక్కన ఏ సమయంలో చూసినా మెజారిటీ వాళ్ళు పిచ్చివాళ్ళు గానే జమవుతారు. జ్వరమొస్తే టాబ్లెట్ వేసుకుంటే అది ఎవరికైనా పని చేస్తుంది. ఏ జ్వరం ఎందుకొస్తుందీ, ఎన్ని రోజులుంటుందీ, ఏ మందు వేసుకుంటే తగ్గిపోతుందీ అనేది ఈరోజు చాలా తేలిగ్గా అర్థమవుతుంది. రాముణ్ణి ప్రార్థించేవాడైనా, రహీమును ప్రార్థించేవాడైనా, యేసును ప్రార్థించేవాడైనా వాడికి టాబ్లెట్ ఒకటే ఎఫెక్టు చూపిస్తుంది కదా!"

ఇంతలో ఇల్లొచ్చింది. ఇంటముందు కారు పార్క్ చేసి లోపలికెళుతూనే మళ్ళీ తానే "మరి కనులముందు కన్పించే నిజాన్ని పక్కనబెట్టి, ఎవరికీ తెలియని ఏదో విషయం గురించి కొందరు నరమేధం సృష్టిస్తున్నారే! అదంతా దేని వల్ల జరుగుతోంది? ఈ ఆచారాలు, పూజలు, మతాలు, గుడ్డి నమ్మకాల వలనే కదా! అట్లాంటప్పుడు అవి పాటించడం ఎంతవరకు సమంజసమంటావ్ బామ్మా!" అని అడిగాడు విశ్వం.

బామ్మ ఆలోచిస్తూ లోనికొస్తోంది. ఆమె ఆలోచిస్తున్నకొద్దీ ఆ లాజిక్‌లోని పట్టు "ఇంతింతై, వటుడింతై, తనింతై... " అన్నట్టుగా పెరిగిపోతోంది

*** *** ***

హాల్లో విశ్వం నాన్నగారు కూర్చుని టీవీ చూస్తున్నారు. నాజీ నేత హిట్లర్‌కు తాను ఓడిపోతున్నానని తెలిసినప్పుడు తన నేతృత్వంలో చంపి పాతిపెట్టిన జ్యూయిష్ శవాలన్నింటినీ తవ్వి కాల్చాలని ఆర్డర్ పాస్ చేసినప్పుడు, బ్రతికున్న శవాల్లాంటి జ్యూయిష్ ప్రజలు, పాతిపెట్టిన వారి శవాల్ని తవ్వి మంటల్లో వేస్తున్నప్పుడు, ఆ వాసనకు ప్రక్కనే వున్న నాజీ సైనికులు ముక్కు మూసుకుంటున్న హేయమైన చారిత్రిక అంశాన్ని చూపిస్తున్నారు 'హిస్టరీ ఛానెల్'లో.అది చూస్తున్న ఆయన "అబ్బ! ఈ జాత్యాంహంకారం, మతాలు మానవునితో ఎంత క్రూరంగా ఆడుకుంటున్నాయో!" అనుకున్నాడు. వీళ్ళిద్దరూ ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటూ రావడం చూసి "ఏంటి! ఏదో సీరియస్‌గా చర్చిస్తున్నట్టున్నారు" అని అడిగారు.

"ఆ! ఏముంది? అమెరికాలో కుర్రాళ్ళకి దేవుడంటే భయభక్తులు లేకుండా పోయాయి. మహాదేవమ్మ గారి నుంచి అనుకోకుండా వచ్చాయి ఆ మాటలు. కాని విశ్వం చెప్పింది అర్థం చేసుకోవడం



కోసం ప్రయత్నిస్తోంది.

"ఏంటి! వీడు ఆర్గ్యుమెంట్లు నీ దగ్గరా మొదలుపెట్టాడా? ఇప్పుడు కుర్రాళ్ళంతా కళ్ళముందు కనిపించేవే నిజమని నమ్ముతున్నారమ్మా! అది కరెక్టే కూడా! వీళ్ళకు విషయాలు చిటికెలో తెలిసిపోతున్నాయి. లైబ్రరీలు, టీవీలు, కంప్యూటర్లు అపారమైన విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. కాని మతం మూఢాచారం అనుకోవడం అంత సమంజసం కాదు. మానవుణ్ణి సరైన మార్గంలో నడిపించడం కోసం ఏర్పర్చిన మార్గం అది. ఒక్కో సమాజంలో తమకు తోచిన రీతిలో ఒక మంచి నడవడిక కోసం ఏర్పాటు చేసి వుంటారు ఈ మతాలను. కాకపోతే దాన్ని కొందరు దుర్వినియోగం చేసి, ఇతరుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. అదీ సమస్య" అన్నారాయన.

"కరెక్టే డాడీ! మతం మనిషి ఎదుగుదలకు తోడ్పడితే నిజంగా అది గొప్ప విషయం. ఒకప్పుడు మానవునికి మతం ఉపయోగపడి వుండొచ్చు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో అదొక డ్రగ్‌గా మారిపోయింది. మనిషి మతం పేరు మీద వేరైపోయాడు. అయోధ్యలో రామమందిరాన్ని బాబర్ పడగొట్టినప్పుడు రాముడేమీ చెయ్యలేదు. మళ్ళీ అదే మసీదును పడగొట్టినప్పుడు అల్లా ఏమీ చేయలేదు. కాని ఎంతమంది అమాయకులు అందులో బలైపోయారు? మానవుడు మతం పేరుమీద కత్తులు దూసుకునే రోజులు పోయాయి. అణు బాంబులు రువ్వుకునే రోజులొచ్చాయి. కనీసం ఇప్పుడైనా మానవుడు ఆలోచించాల్సిన అవసరం వుంది. లేకుంటే కలియుగం నిజంగానే అంతరించిపోతుంది" ఆవేశంగా చెప్పుకుపోయాడు విశ్వం.

"మీరు అణుబాంబుల్లోంచి కాస్త కాఫీల్లోకి వస్తారా బాబూ" అంటూ నవ్వుతూ కాఫీలు తీసుకొచ్చింది విశ్వం అమ్మగారు.


ఎప్పుడూ నవ్వుతూ, సరదాగా వుండే కోడల్ని చూస్తే ముచ్చటేస్తుంది మహాదేవమ్మకు. కోడల్నే చూస్తూ కాఫీ త్రాగుతోంది ఆవిడ. కాఫీ త్రాగుతున్నా ఆలోచనలు ఆమెను విడవడం లేదు.

"ఏంటి నన్నే చూస్తున్నారు? వీడికి భక్తి పాఠాలు బోధించట్లేదనా వీళ్ళదంతా సైబర్ యుగం అత్తయ్యా!" ఏదైనా విశేషం చెబితే పది నిమిషాల్లో ఇంటర్‌నెట్‌లో దానికి సంబంధించిన విషయంపై ఏదో ప్రూఫ్ తీస్తారు. ఈ పిల్లల ఆలోచనా విధానం మారిపోయింది. ప్రతిదాన్నీ లాజికల్‌గా ఆలోచించడం వీడికి అలవాటు. నాక్కూడా దానివలన చాలా ఉపయోగం వుందనిపిస్తోంది. ఒకసారి "పరీక్షల్లో ఫస్ట్ ర్యాంకు రావాలని దేవుణ్ణి మొక్కుకోరా!" అంటే వీడేమన్నాడో తెలుసా! "అంటే బాగా చదివిన వాడిని పరీక్షలు బాగా వ్రాయకుండా చేసి, నాకు ఫస్టు ర్యాంకు ఇప్పిస్తాడా దేవుడు?" అని. వీడి ఫ్రెండ్ జోసెఫ్ అంతే గమ్మత్తుగా ఆలోచిస్తూ వుంటాడు" అని అంది వైశాలి అత్తగారితో. మళ్ళీ తానే విశ్వం వైపు తిరిగి–

"మన్నీ మధ్య బామ్మతో గుడికెళ్తున్నావు కదా! బామ్మ నిన్ను కొంచెం మార్చిందేమో అనుకున్నాను" అంది నవ్వుతూ.

"బామ్మ ఎప్పటి నుంచో ఆచరిస్తున్నవి మనను చంపుకొని ఎందుకు మానుకోవాలి? ఈ వయసులో ఆవిడను బాధపెట్టడం దేనికి? అదీకాక ఏదో స్విచ్ వేసినట్టు మారిపోను కదా నమ్మకాలు! నేను గుడికి బామ్మతో వెళ్ళకపోవడం వల్ల బామ్మకు మేలు చేయడం అటుంచి, బామ్మ గుడికి వెళ్ళలేకపోవడం వల్ల బాధపడుతుంది. అందుకే బామ్మ ఆనందం కోసం గుడికి వెడుతున్నాను" అన్నాడు విశ్వం.

కొడుకు ఆలోచనా విధానానికి తల్లిదండ్రులు, తన మీద ప్రేమకు బామ్మ ముగ్ధులైపోయారు. మనుమడిని దగ్గరకు తీసుకుని ప్రేమగా తల



నిమిరింది బామ్మ. డిన్నర్ రెడీ చేయడానికి లోపలికి వెళ్ళింది వైశాలి.

*** *** ***

విశ్వం, బామ్మ శివ–విష్ణు గుడిలో వేంకటేశ్వరస్వామి గుడిచుట్టూ ప్రదక్షిణలు ముగించి హారతి కోసం నిలబడ్డారు. పూజారి మంత్రాలు చదువుతూనే, మధ్య, మధ్యలో అడుగుతున్నాడు "ఈస్ దేర్ ఎనీబడీ వాంట్స్ టు పెర్ఫార్మ్ స్పెషల్ పూజా?". ఒకరిద్దరు స్పెషల్ పూజ కోసం ఐదు డాలర్లిచ్చి కొన్న టికెట్లిచ్చారు. పూజారి లోపలికి వెళ్ళి పూజ మొదలుపెట్టాడు. విశ్వం వాళ్ళ పక్కకి ఇంకో తెలుగు జంట వచ్చి నిలబడ్డారు. పక్కనే ఒక నాలుగేండ్ల పాప. వాళ్ళమ్మాయి అనుకుంటా. చేతులు జోడించి, అచ్చం వాళ్ళ అమ్మలాగే కళ్ళు మూసుకొని, కొంచెం తలవంచి మొక్కుకుంటోంది. ఇంతలో హారతొచ్చింది. పూజారి మంత్రాలు చదువుతున్నాడు. "ఓం వేంకటేశ్వరాయనమః, గోవిందాయనమః.."

"పాప నెమ్మదిగా కళ్ళు తెరిచి వాళ్ళమ్మ చేయి పట్టి లాగి అడిగింది "అమ్మా! అమ్మా మనం పూజ ఎందుకు చేస్తున్నాం?"

అది విన్న బామ్మ విశ్వం వైపు తిరిగి చిన్నగా నవ్వి మనసులో అనుకుంది "సైబర్ చైల్డ్" అని. పూజారి మంత్రాలు చదువుతూనేవున్నాడు.

## రామానాయుడు మంచితనం

సంపాదించిన దానిలో కొంత జనం కోసం ఖర్చు చేయాలన్న ఆలోచన వచ్చినందుకు ముందుగా స్టార్ ప్రొడ్యూసర్ రామానాయుడు అభినందనీయుడు. తన 'పెద్ద మనుషులు' సినిమాకి వచ్చిన లాభాన్ని మన రాష్ట్రంలోని ఒక గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ఖర్చుపెడతానని, అంతే కాకుండా ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమల నుంచి ఒక్కో గ్రామాన్ని దత్తత తీసికొని వాటిని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉన్నారు.

## 'దేశీయగీతం' రాజకీయం

ఒక రాజకీయనాయకుడు సినిమాల్లో నటిస్తే ఎంతో ఆర్భాటం చేస్తారు. అలాగే ఒక సినీనటుడు రాజకీయాల్లో ప్రవేశిస్తే ఇంకో సంచలనం అవుతుంది. కానీ చెన్నైలో టి.ఎం.సి. నాయకుడు మూపనార్ 'దేశీయగీతం' సినిమాకి ఒక షో బుక్ చేసుకొని కార్యకర్తలతో కలిసి చూస్తే దానికి బోల్డంత పబ్లిసిటీ ఇచ్చి చాలా హడావుడి చేస్తున్నారు. దాన్ని తెలుగులో రీమేక్ చేస్తే మన వాళ్ళెంత గొడవ చేస్తారో చూడాలి.